విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

# నిరుద్యోగుల నిరుత్సాహం

- పోస్టులు తక్కువ... పోటీ ఎక్కువ
- అప్రెంటిస్ విధానం పై ఆందోళన
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

**విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు:** ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీలు గుప్పించిన ముఖ్యమంత్రి జగన్ ఆ హామీలను గాలికొదిలేసి, ఎన్నికల వేళ హడావిడిగా డిఎస్‌సి డ్రామాకు తెరలేపారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి విడుదల చేస్తా మని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క డిఎస్‌సి విడుదల చేయలేదని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాజాగా మంత్రిమండలిలో మెగా డి ఎస్ సి నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందని నిరుద్యోగులు ధ్వజమెత్తారు. పైగా ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటిస్ విధానాన్ని తిరిగి అమలు చేసేలా పావులు కదపడం అన్యాయమని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

### దగా డిఎస్‌సి

వైసీపీ ప్రభుత్వం తమను దగా చేస్తున్నదని నిరుద్యోగ యువత మండిపడుతోంది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక తను కప్పి పుచ్చుకోవడానికి డిఎస్‌సి నోటిఫికేషన్ అంటూ మభ్య పెడుతోందని వారు వాపోతున్నారు. ఐదేళ్లలో కనీసం ఒక్క డిఎస్‌సి కూడా విడుదల చేయ కుండా తాజాగా నిబంధనలు, షరతులతో డిఎస్‌సి విడుదల చేయడం బాధాకర మని నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. లక్షలాదిమంది బీఈడీ, టిటిసి పూర్తి చేసిన నిరుద్యోగులు చిన్న చిన్న ఉద్యో గాలు, పనులు చేసుకుంటూ డి ఎస్ సి నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా ప్రకటించిన డి ఎస్ సి చూడగానే తమ గుండెలు బరువెక్కిపోయాయని వాపోయారు.

### అప్రెంటిస్ విధానం పై ఆందోళన

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యో గులు, ఉపాధ్యాయులకు వేతనాలు కూడా సకాలంలో ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 2024 డి ఎస్ సి విడుదల చేయాలని, ఉపాధ్యాయులుగా నియమితులయ్యే వారికి అప్రెంటిస్ విధానం ఉపాధ్యాయ సంఘాలు, నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్రెంటిస్ విధానాన్ని 2012 డిఎస్‌సిలో రద్దు చేశారు. 12 ఏళ్ల తర్వాత అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.దీన్ని పునరుద్ధ రించడంపై నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

### ఉమ్మడి పశ్చిమలో 306 పోస్టులతో సరి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాఠశాల విద్యకు 228, సంక్షేమ పాఠశాలలకు 78 పోస్టులు కేటా యించారు. ఖాళీలను 117 జీవో కుదించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించారు. 306 ఉపాధ్యాయ ఖాళీలను డి ఎస్ సి లో భర్తీ చేయనుండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్, టి జి టి కేడర్ పోస్టులు204,ఎస్ జి టి 102, పోస్టులను నోటిఫై చేసింది.పాఠశాల విద్యాశాఖ పరిధిలోని మున్సిపల్, ప్రభుత్వ, జెడ్‌పి యాజ మాన్యాల పాఠశాలలలో స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు 164,ఎస్‌జిటి 88 భర్తీ అవుతాయి. ఇవి గాక ఎస్‌జిటి కేడర్‌లో కేటాయించిన 88 పోస్టులలో 68 ఖాళీలు జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజ మాన్యాలకు మిగతా 20 ఖాళీలను మున్సిపల్ యాజమాన్య పాఠశాలలకు ఆ ప్రకారం పాఠశాల విద్యాశాఖ పరిధిలో నోటిఫై చేసిన మొత్తం 228 పోస్టులలో ప్రభుత్వ, యాజమాన్య, జిల్లా పరిషత్, ఎంపీపీ యాజమాన్యాలకు 183, మున్సిపాలిటీలకు 45 పోస్టులు నిర్దేశించినట్లు యాజమాన్యాలలో 78 పోస్టులు బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలను డిఎస్‌సిలో చేపడుతున్నారు. గతంలో వేరువేరుగా ప్రకటనలు తయారుచేసి భర్తీ చేసేవారు. అన్నీ కలిపి ఒకే ప్రకటన ద్వారా భర్తీ చేయడం నిరుద్యోగులను దగా చేయడమే నంతున్నారు.

### కొరవడిన స్పష్టత

డిఎస్‌సి ప్రకటనకు ముందుగానే ఖాళీల వివరాలు సేకరించాల్సిన విద్యా శాఖలో స్పష్టత కొరవడింది. నిర్దిష్టమైన తేదీలోపు ఎన్ని ఖాళీలు ఉన్నాయో సమగ్ర వివరాలను ప్రభుత్వం కోరలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు హడావిడిగా జనవరి 31 లోపు పదవి విరమణ చేసిన వారు,మృతుల వివరాలు సేకరించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఎప్పటికీ పూర్తవు తుందో కూడా తెలియదని, ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఖాళీలు గుర్తించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్లు అధికారులు తెలిపారు.

### హక్కులు కాలరాస్తున్నారు
**ఎల్. సాయి శ్రీనివాస్, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు**

ఎన్నో ఉద్యమాలు, సమ్మెల ద్వారా సాధించుకుండా విధానం రద్దును ఈ ప్రభుత్వం తిరిగి తీసుకు రావడం తమ హక్కులు కాలరాయడమేనని, ఎవరూ అడగకుండానే పదవి విరమణ వయసు పెంచడం ద్వారా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న ప్రభుత్వం కేవలం 6,100 పోస్టుల భర్తీకి ఆమోదం తెలపడం నిరుద్యోగులను మోసం చేయడమే.

### బానిసత్వంలోకి నెట్టడమే
**సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య**

ఉపాధ్యాయులు ఏళ్ళ తరబడి పోరాటాలు చేసి రద్దు చేయించుకున్న అప్రెంటిస్ విధానాన్ని ఏపీ ప్రభుత్వం పునరు ద్ధరించాలని ఆలోచన చేయడం నిరుద్యోగులను బానిసత్వంలోకి నెట్టడమే. ఎన్నికల ముందు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ, ఉద్యోగులను వేధింపులే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నది. తాజాగా ఎన్నికల స్టంట్ డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించింది. ప్రభుత్వం పునరాలోచించి అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి.

## 16న బంద్ విజయవంతానికి ఏలూరులో బైక్ ర్యాలీ

**విశాలాంధ్ర-ఏలూరు:** కేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న జరుగుతున్న పారిశ్రా మిక సమ్మె - గ్రామీణ భారత్ బంద్ విజయవంతం కోరుతూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల

అధ్వర్యంలో ఏలూరులో బుధవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి ప్రారంభమై గడియార స్తంభం మీదుగా పెద్ద పోస్ట్ ఆఫీస్, జూట్ మిల్, ఫైర్ స్టేషన్ సెంటర్ గుండా విజయ విహార్ సెంటర్ మీదుగా పవర్ పేట రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుంది.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, బి కే ఎం యు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి ఎన్ వి డి ప్రసాద్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు ముంగాపు అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఢిల్లీలో రైతాంగం పెద్ద ఎత్తున పోరాడుతుంటే కేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ బాష్ప వాయువు ప్రయోగించి రైతు ఉద్యమాన్ని అణిచే చర్యలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఏఐటియుసి నగర కార్యదర్శి ఏ అప్పలరాజు, ఐ ఎఫ్ టు యు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు నాయకులు ఎం క్రాంతి కుమార్, సిఐటియు ఏలూరు నగర అధ్యక్ష కార్యదర్శులు బి జగన్నాథం, వి సాయిబాబు, గోపి జానుబాబు, పలు కార్మిక సంఘాల నాయకులు ఎస్ ఎం వి సుబ్బారావు, ఏ మూర్తి, సత్యనారాయణ, దేవి శ్రీనివాస్, మీసాల సత్యం, డి వీర నాయుడు, భూపతి చిన్నబి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయులు దామోదరం సంజీవయ్య

**- సంజీవయ్యకు కలెక్టర్ నివాళులు**

**విశాలాంధ్ర-ఏలూరు:** మాజీ ముఖ్యమంత్రి, దివంగత దామోదరం సంజీవయ్య ఆదర్శనీయులని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. దామోదరం సంజీవయ్య 103 వ జయంతిని పురస్కరించు కుని బుదవారం సాంఘిక సంక్షేమ శాఖ

అధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య క్రమశిక్షణ, పట్టుదల, ఓర్పు, సహనంతో అనేక విజయాలు సొంతం చేసుకున్నారని చెప్పారు. అలాంటి వాటిని నేటి తరం ఆయుధాలుగా మలుచుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి,సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, కలెక్టరేట్ ఏవో కె. కాశీ విశ్వేశ్వర రావు, డిఆర్ డీఏ పిడి ఆర్.విజయ రాజు,జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎన్ ఎస్ కృపవరం,మెప్మ పిడి ఇమ్మాయిన్యుల్,దళిత నాయకులు పొలిమేర హరికృష్ణ, మట్టారాజు, ప్రవల్లిక, మేతర అజయ్ బాబు, మెండెం సంతోష్ కుమార్, జంగా మధు సూధన రావు, పరిసిపోగు బాలరాజు, అంద్రి డొమిక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై దమనకాండ దుర్మార్గం: డేగా ప్రభాకర్

**విశాలాంధ్ర-ఏలూరు:** రైతులు శాంతియుతంగా నిర్వహిస్తున్న చలో ఢిల్లీపై మోదీ ప్రభుత్వం నిర్బంధచర్యలకు దిగి దమనకాండకు పాల్పడటం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో




ఆయన మాట్లాడుతూ, ఢిల్లీ- హర్యానా సరిహద్దుల్లో ఇనుప మేకులు, ముళ్ల తీగలు, కాంక్రీట్ బారికేడ్లు, పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు మోహరించి రైతులపై మోదీ ప్రభుత్వం యుద్ధం ప్రకటించడం దారుణమన్నారు. అనాదిగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వాలని, అటవీ బంజరు భూములను అర్హులైన గిరిజనులకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు సీపీఐ, రైతు సంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మిక, కర్షకులు, మహిళలు, విద్యార్థి, యువజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధ చర్యలు దారుణం

**- ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య**

**విశాలాంధ్ర-ఏలూరు:** రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీకి వస్తున్న రైతులపై మంగళవారం టియర్ గ్యాస్ ఉపయోగించి,లాఠీచార్జి చేసి దమన కాండకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వ

చర్యను ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం తీవ్రంగా ఖండించింది. బుధవారం ఏలూరులో సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఏలూరు జిల్లా కౌన్సిల్ సమావేశం రావెళ్ల రాజారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న జమలయ్య మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ దుందుడుకు చర్యలను ప్రజాతంత్ర వాదులందరరూ ఖండించాలని కోరారు. 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కార్మిక,కర్షకల డిమాండ్లతో ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్, శ్రామికుల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమం సందర్భంగా మరణించిన 750 మంది రైతు కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమానికి సంబంధించిన 44 కార్మిక చట్టాలు రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లెబర్ కోడ్ లు తీసుకొచ్చారని ఈ లేబర్ కోడ్ లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌలురైతుల సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతాకృష్ణ,రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, జిల్లా కౌలురైతుల సంఘం నాయకులు టి. ప్రసాదు, చాపలమడుగు నరసింహారావు,కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ బంద్ జయప్రదం చేయండి

**విశాలాంధ్ర-కామవరపుకోట:** కేంద్ర,కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ బందును జయప్రదం చేయాలని సిపిఐ

మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, గ్రామీణ ప్రాంత ఉపాధి హామీ కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు, పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచుకుండా దేశ ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మిక సంఘ నాయకులు పోలిమెట్ల ఎర్రాయం, పోలిమెట్ల సిలోమాను, తదితరులు పాల్గొన్నారు.

## 16న గ్రామీణ బంద్, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**ఏఐటీయూసీ, సీఐటీయూ జేఏసీ**

**విశాలాంధ్ర-నూజివీడు టౌన్:** ఈనెల 16న గ్రామీణ బంద్ , సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఏఐటియుసి, సీఐ టీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక

అమర భవన్ లో జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయు కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు పరాకాష్టకు చేరాయని అన్నారు. దేశానికి వెన్నుముకైన రైతులు సంపద సృష్టిస్తున్న, కార్మికులను, మోడీ ప్రభుత్వం తీవ్ర నష్టాలకు గురి చేస్తున్నదని ధ్వజమెత్తారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లు తీసుకురావడంతో కార్మికులకు నష్టం జరుగుతుంద న్నారు. ఈనెల 16న జరుగే గ్రామీణ బంద్ ను అన్ని కార్మిక సంఘాలు, ప్రజలు, రైతు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు పట్టణ కార్యదర్శి ఎన్. హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వాగ్దానాలను విస్మరించిన మోది

**విశాలాంధ్ర- కొయ్యలగూడెం :** కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా కంటక విధానాలను అమలుపరుస్తూ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలకు

తిలోదకాలు వచ్చారని సిపిఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దారయ్య మాట్లాడుతూ మోడీ హయాంలో రూ. 100 లక్షల కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని అప్పుల భారత్‌గా మార్చారన్నారు. ఏలూరు జిల్లా సమితి సభ్యుడు టీవీఎస్ రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సిపిఐ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలగల రామారావు, ప్రత్తిపాటి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## 16న బంద్ జయప్రదం చేయండి

**విశాలాంధ్ర -చింతలపూడి:** బిజెపి ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘ టిస్తూ మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానా లను వ్యతిరేకిస్తూ ఈ నెల16న దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. వివిధ రైతు కార్మిక

సంఘాల సమావేశం ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి. రంగనాథ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ వి సత్యనారాయణ, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమలయ్య మాట్లాడుతూ కేంద్ర బిజెపి కార్పొరేట్ మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈ నెల16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని సంయుక్త మోర్చా, కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వ ధోరణులకు నిరసనగా ఈ నెల 16న జరిగే కార్మికుల సమ్మె ,గ్రామీణ బంద్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, లక్షలదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.బాలరాజు, ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి బాబు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు హెచ్. సుందరి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి. అంజమ్మ, సరోజినీ, మాణిక్యం, యానిమేటర్ యూనియన్ నుంచి బి కృష్ణవేణి, ఝాన్సీ, ముఠా వర్కర్స్ యూనియన్ నుంచి వీర్రాజు, వెంకటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లారు సోమశేఖర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నుంచి వి. అనురాధ, వ్యవసాయ కార్మిక సంఘం నుంచి డి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములు మృతి సీపీఐకి, చేనేత కార్మిక సంఘానికి తీరని లోటు

**విశాలాంధ్ర-ఏలూరు:** సీపీఐ సీనియర్ కార్యకర్త, తూర్పు వీధి సీపీఐ శాఖ కార్యదర్శి, ఏపి చేనేత కార్మిక సంఘం ఏలూరు ఏరియా నాయకులు సామన శ్రీరాములు మృతి సిపిఐకి, చేనేత కార్మిక సంఘానికి తీరని నోటని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కడుపు కన్నయ్య అన్నారు. కొంత కాలంగా అనారో గ్యంతో బాధపడుతున్న శ్రీరాములు

బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. తూర్పు వీధిలోని శ్రీరాములు స్వగృహం వద్ద ఉన్న మృతదేహాన్ని సిపిఐ, ఏపి చేనేత కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటియుసి, నాయకులు సందర్శించి నివాళు లర్పించారు.శ్రీరాములు భౌతికకాయంపై సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పార్టీ జెండాను కప్పి పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కడుపు కన్నయ్య శ్రీరాములు భౌతిక కాయంపై పుష్పమాల వేసి నివాళులర్పించారు. సామన శ్రీరాములు మరణం పార్టీకి, చేనేత కార్మిక సంఘానికి, వారి కుటుంబానికి తీరని బాధను మిగిల్చిందని కృష్ణ చైతన్య, కన్నయ్య, పేర్కొంటూ శ్రీరాములు కుటుంబ సభ్యులకు ముఖ్యంగా వారి కుమార్తెకు అల్లుడుకు ధైర్యం చెప్పి ఓదార్చారు. శ్రీరాములు మృతికి సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సామన శ్రీరాములు మృతికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, బేత శంకర్, సంతాపం తెలిపారు.

## 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయండి

**విశాలాంధ్ర-ఏలూరు:** కేంద్ర ప్రభు త్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు ఉద్యోగులకు, కార్మికులకు, రైతులకు, గ్రామీణ పేదలకు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ముంగపు అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు వి. సాయి బాబా అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కెవి రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్వి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను కార్పొరేట్‌శక్తులకు ప్రైవేటు సంస్థలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో,రైతాంగ సమస్యలను పరిష్కరించడం, కార్మిక హక్కులను పరిరక్షించడం, గ్రామీణ పేదలకు ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 16న ఏలూరు జిల్లాలో జరుగుతున్న పారిశ్రామిక సమ్మె గ్రామీణ భారత్ బందును జయప్రదం చేయాలని కార్మికులకు ప్రజలకు ఉద్యోగులకు రైతులకు వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. కృష్ణమాచార్యులు, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కోశాధికారి పుప్పాల కన్నబాబు, నగర కార్యదర్శి ఎ. అప్పలరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, జోగి నాగేశ్వరరావు, వి. గంగరాజు, సిఐటియు నాయకులు బి. జగన్నాథం, గోపి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు,నాయకులు సందక అప్పారావు, ఈశ్వరరావు, శ్రీను, కాకి నాని, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ బంద్ జయప్రదం చేయండి

**విశాలాంధ్ర- కొయ్యలగూడెం :** సంయుక్త కిసాన్ మోర్చా, బి కే ఎం యు, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల16న జరిగే గ్రామీణ బందును జయప్రదం చేయాలని పట్ట ణంలో సిపిఐ ప్రచారం నిర్వహిం చింది. సిపిఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, ఏలూరు




జిల్లా సమితి సభ్యుడు టీవీఎస్ రాజు, మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. దేశంలోని రైల్వే, టెలికం, రవాణా, అటవీ, తదితర దేశానికి ఆదాయాలు చేకూర్చే మౌలిక సంస్థలను నరేంద్ర మోడీ, అంబానీ, ఆదాని లాంటి కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టి దేశంలో నిరుద్యోగ యువతకు అన్యాయం చేస్తున్నాడని విమర్శించారు. డిమాండ్ల సాధన కోసమే గ్రామీణ బంద్ తలపెట్టారని ఉపాధి హామీ కార్మికులు,వ్యవసాయ కార్మికులు స్వయం ఉపాధి కార్మికులు బందును జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కెరటం వెంకటేశ్వర్లు,ఏఐటీయూసీ నాయకులు వెలగల. రామారావు, డి.గంగరాజు, ధర్మయ్య, నరసయ్య,తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ కలెక్టర్‌గా సుమిత్ కుమార్ గాంధీ

**విశాలాంధ్ర -భీమవరం:** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సుమిత్ కుమార్ గాంధీని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు కలెక్టర్ గా పని చేసిన పి.ప్రశాంతి మార్కెటింగ్ శాఖ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

సుమిత్ కుమార్ గాంధీ 2014లో నరసాపురం కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి పనిచేసారు. 2017లో దేశ వ్యాప్తంగా వెలుగులోకి వచ్చిన గరగపర్రు దళితుల సాంఘిక బహిష్కరణ ఘటనలో ఉద్రిక్తతలు మరింతగా పెరగకుండా నర్సాపురం సబ్ కలెక్టర్‌గా ఆయన రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించి పరిస్థితులు చక్కపెట్టి పలువురి ప్రశంసలందు కున్నారు. తొలుత ఆయన అనంతపురంలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసి తదుపరి నర్సాపురం సబ్ కలెక్టర్‌గా శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్‌గా పని చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

## నూజివీడు డిఎస్‌పిగా మురళీకృష్ణ

**విశాలాంధ్ర- నూజివీడు టౌన్:** నూజివీడు డివిజన్ నూతన డిఎస్ పి గా చిటికిన మురళీకృష్ణను నియమిస్తూ బుధవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం సిసిఎస్, డిఎస్‌పి గా పనిచేస్తూ బదిలీపై నూజివీడు వచ్చారు. ప్రస్తుత డిఎస్‌పి గా పని చేస్తున్న అశోక్ కుమార్ గౌడ్ విజయవాడ ట్రాఫిక్ ఏసిపిగా బదిలీ అయ్యారు.

## 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయండి

**- ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పిలుపు**

**విశాలాంధ్ర ఏలూరు:** ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్, కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ ఐడబ్ల్యు)ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని బుధవారం ఒక ప్రకటనలో పిలుపు

నిచ్చారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో సాగిన సమ్మె సందర్భంగా మోడీ ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మిక వర్గానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం తలపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 32 మంది ఆత్మబలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా విక్రయించడానికి ప్రధాని మోడీ దుష్టపన్నాగాలు పన్నుతున్నారని, కార్మిక వర్గం అలుపెరుగని పోరాటాలతో ప్రైవేటీకరణ ప్రయత్నాలను తిట్టుకొట్టారని తెలిపారు. ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో జిల్లాలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎస్‌జిటి పోస్టుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**విశాలాంధ్ర-బుట్టాయిగూడెం:** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు డి ఎస్ సి ప్రకటన ఇచ్చిన నేపథ్యంలో ఐ.టి.డి.ఎ, కె.ఆర్.పురం పరిధిలో గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు యువత శిక్షణా కేంద్రం (వై టి సి), కే. ఆర్. పురం, నందు డే-స్కాలర్ (నాన్ రెసిడెన్షియల్) విధానంలో ఎస్ జి టి పోస్టులకు శిక్షణ ఇచ్చుట కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ పివో యం. సూర్యతేజ ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ పరిధిలో ఆసక్తి గల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు వై టి సి, కె.ఆర్. పురం నందు ఈ నెల 16లోపుగా ధరఖాస్తు చేసుకోవలసిందిగా ఆయన తెలిపారు.కోచింగ్ క్లాసులు ఈ నెల 17నుండి ప్రారంభమవుతా యన్నారు. దరఖాస్తు కొరకు అభ్యర్థులు వారి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, డిఎస్‌సి రిజిస్ట్రేషన్ స్లిప్‌తో మేనేజర్ వై టి సి కె. ఆర్. పురం (ఫోన్ నెం-9490285277) వారిని సంప్రదించాలన్నారు.

## దాతల సహకారంతో దేవాలయాల అభివృద్ధి

**విశాలాంధ్ర - నిడమర్రు:** గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ దేవతల ఆలయాలను పునర్‌నిర్మాణా నికి దాతల సహకారం ఎంతైనా అవసరమని ఉంగు టూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. బుధవారం నిడమర్రు మండలం ఎనికేపల్లి గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ వారి ఆలయ పున ప్రతిష్ట

ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామదేవతల ఆలయాలు అభివృద్ధికి ప్రభుత్వం మీద ఆధారపడకుండా గ్రామాల్లో ఉన్న దాతలు ముందుకు వచ్చి ఆలయాలు అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుప్పాల మెహర్ కుమార్, జడ్పిటిసి కోడే కాశీ, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ సంకు సత్య కుమార్ ,వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జల్ జీవన్ ద్వారా మంచినీటి పనులు ప్రారంభం

**విశాలాంధ్ర - కైకలూరు :** రూ. 36 లక్షలతో జల్ జీవన్ ద్వారా మంచి నీటి పనులు గ్రామాల లో తాగునీటి అవసరాలకు అనుగుణంగా వుంటాయని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయ మంగళ వెంకట రమణ అన్నారు. మండలంలోని చటాకాయలో 36 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులు ద్వారా మంజూరై నిర్మించబోతున్న మంచి నీటి పైపు లైను

పనుల భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించాలనే లక్ష్యంతో,గ్రామాల అభివృద్దే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, జడ్పీటీసీ కురేళ్ళ బేబీ, జిల్లా వైసీపీ కార్యదర్శి మహ్మద్ జహీర్,సర్పంచ్ ఘంటసాల శేషారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పార్థసారథి పర్యటన

**విశాలాంధ్ర -నూజివీడు :** నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థిగా పార్టీ అధిష్టానం తనకు సీటు ఖాయం చేసిందని పెనమ లూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి బుధవారం నాడు నియోజకవర్గంలో స్థానిక తెలుగుదేశం నాయకులను కలసి తనకు మద్దతు ఇవ్వాలంటూ అభ్యర్థించారు. తొలుత ఆగిరిపల్లి మండలం లోని గ్రామాల్లో తెలుగుదేశం నాయకులను కలిసిన పార్థసారథి నూజివీడు

మండలం బత్తుల వారి గూడెంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముసునూరు రాజా గృహానికి చేరుకుని తెలుగుదేశం నాయకులతో పరిచయ కార్యక్రమాలను చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి మండలం లోని నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరం వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చలసాని గోపాలకృష్ణ,మిట్టగూడెం సర్పంచ్ కొనకాల నరసింహారావు ,మండల తెలుగుదేశం నాయకులు వీరమాచినేని సత్యనారాయణ, అన్నే సురేష్, పర్వతనేని సాయి కృష్ణ, వంకాయల హరిబాబు పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం నాయకులు హాజరయ్యారు.

# విశాలాంధ్ర గోదావరి జిల్లా

**కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ**

## విలసవిల్లిలో జగనన్న సురక్ష

**విశాలాంధ్ర - ఉప్పలగుప్తం :** ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన రెండవ విడత జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సలాది ఊర్మిళ దేవి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సలాది సతీష్, జడ్పిటిసి గెద్దం సంపద రావు, కార్యదర్శి దాసరి కృష్ణాజి, ఉంగరాల నాగేశ్వరరావు, ముత్యాల వెంకట నారాయణ, దాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై నాయకుల మండిపాటు

**విశాలాంధ్ర -పెరవలి :** బుధవారం పెరవలి మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సర్వసభ్య సమావేశంలో కొందరు ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. మండల అధ్యక్షులు కార్చర్ల సీతారామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల ద్వారా జరుగుతున్న పనులను వివరించారు. ఈసందర్భంగా ఖండవల్లి యంపిటీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లంకమాలపల్లి ప్రాంతంలో పంటకాలువ పూడిక పనులు చేపట్టడం లేదన్నారు. జగనన్న కాలనీలో ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ లైన్లు వేయడంలేదని అధికారులను నిలదీశారు. కానూరు సర్పంచ్ మధు మాట్లాడుతూ కానూరు గ్రామంలో యస్ ఆర్ ఇ జియస్ మేట్ గా ఎక్కువకాలం ఎవరూ పనిచేయడం లేదని అందుకు ఆగ్రామంలో గల కొందరు నాయకుల వత్తిడిఅని దానివలన ఆగ్రామంలో ఉపాధిహామీ పనులు చేయించుకోవడం ఇబ్బందిగా మారిందని అన్నారు. పెరవలి యంపిటిసి ప్రమీల మాట్లాడుతూ నిడదవోలు నుండి పెరవలి ఆర్టీసీ బస్ సర్వీస్లు క్రమంగా జరిగేలా చూడాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## కృష్ణవేణికి టీచర్ల ఆత్మీయ సన్మానం

**విశాలాంధ్ర - కరప :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న ఎంఈఓ కెబి కృష్ణవేణికి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఎంఈఓ కృష్ణవేణి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వై.సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ ఆశాజ్యోతి, ఉపాధ్యాయులు అలీం, శివ ప్రసాద్, సాయి మోహన్, ఎమ్మార్పీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం

**విశాలాంధ్ర - ముమ్మిడివరం :** పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు ఎన్. స్టీఫెన్ బాబు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు, ముమ్మిడివరం నగర పంచాయతీ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, చీరలు 150 మందికి పైగా పంపిణీ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కన్వెన్షన్లో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు టి.నాగరాజారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓఎన్జీసి ఎస్సి మరియు ఎస్టి ఎంప్లాయిస్ చైర్మన్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసి ఉన్నారని వారి సేవలు అభినందించ దగ్గ విషయమని తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారి రమణశ్రీ మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు దుప్పట్లు, చీరలు ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె వెంకటేశ్వరరావు, ఓఎన్జిసి అధికారి యస్. రాజకుమార్, ప్రసాద్ ఎం. ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

## 27వరకు ఉద్యమ కార్యాచరణ

**విశాలాంధ్ర - తాళ్ళపూడి :** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కారం కొరకు ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 27 వరకు జరిగే ఉద్యమ కార్యాచరణను జయప్రదం చేయాలని కోరుతూ తమ డిమాండ్లను వెల్లడించారు. ఏ.పి.జే.ఏ.సి ఉద్యమ కార్యాచరణ ప్రకటన ప్రకారం అన్ని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని జే.ఏ.సి చైర్మన్ జోడాల వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ 15, 16. తేదీ లలో నల్ల బ్యాడ్జీలను ధరించి మధ్యాహ్నభోజన విరామ సమయంలో కార్యాలయాలు వద్ద పాఠశాలలల్లో నిరసనలు తెల్పాలని, 17న తాలూకా కేంద్రములో తహశీల్దార్ ఆఫీసు వద్ద ధర్నా, 20 న జిల్లా కేంద్రంలో కలక్టరేట్ వద్దర్యాలీ, ధర్నా, 21 నుండి 24 వరకు రాష్ట్ర నాయకుల జిల్లాల పర్యటన, 27న చలో విజయవాడ చేస్తున్నట్లు ఉద్యమ కార్యాచరణ ప్రకటనలో తెలియచేశారు.

## బ్యాంకు మేనేజర్లకు అవగాహన



**విశాలాంధ్ర - గండేపల్లి :** గండేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం జగ్గంపేట సిఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో గండేపల్లి మండలంకు సంబంధించిన బ్యాంక్ మేనేజర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ మధ్యకాలంలో ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఉత్తర కంచి గ్రామంలో ఎస్బిఐ బ్యాంకు వద్ద రోబరీ జరిగిన కారణంగా, అలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలుగా జగ్గంపేట సిఐ లక్ష్మణరావు బ్యాంక్ మేనేజర్లతో మీటింగ్ నిర్వహించారు. ప్రతి బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డ్ తప్పనిసరిగా ఉండాలని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని, తదితర అంశాలపై బ్యాంక్ మేనేజర్లకు అవగాహన కల్పించారు.

## బీమాభాయ్‌కు ఘన నివాళులు

**విశాలాంధ్ర-కొవ్వూరు :** నవభారత రాజ్యాంగం నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ తల్లి భీమబాయ్ 175వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ 125అడుగుల విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించినట్లు మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బొంతా శ్యామ్ రవి ప్రకాష్ తెలిపారు. అంటరాని తనం దేశంలో తాండవిస్తున్నపుడు అంబేద్కర్ గార్కి జన్మనిచ్చిన మహనీయురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబటి కొండల రావు, దొడ్డి వెంకట్రావు, బొంతా తనోజ్, కావూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## 3న పల్స్ పోలియో

**విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ :** జిల్లాను పోలియో రహిత జిల్లా గా తీర్చి దిద్దుదామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైద్యాధికారులకు సూచించారు. బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం. కళాకేంద్రంలో మార్చి 3 వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం పై వైద్యాధి కారులు, వైద్య సిబ్బంది తో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కే. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 0-5 సంవత్సరాలు గల పిల్లలు 1,88,772 ఉన్నారని వీరందరికీ పోలియో వాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మెంబర్ డాక్టర్ జాన్ జ్యూ డే జూసఫ్, జిల్లా ఇమ్యూ నైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక వసతులతో బస్ కాంప్లెక్స్

**విశాలాంధ్ర - అమలాపురం :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో కోనసీమకే తలమానికంగా జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేసేలా నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ మాదిరిగా అత్యాధునిక వసతులతో నిర్మించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో సుమారు రూ.45 కోట్ల అంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న అత్యాధునిక స్టేషన్ బస్సు కాంప్లెక్స్ టెర్మినల్‌కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే గోపీనాథ్ రెడ్డిలు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ జిల్లా స్థాయికి తగిన రీతిలో ప్రజానీకం ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉండేందుకై అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ అత్యాధునిక బస్ స్టేషన్ టెర్మినల్ నిర్మాణం కొరకు తొలి దశలో రూ.5 కోట్ల నిధులు రాష్ట్ర రవాణా శాఖ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్ భవనాన్ని తొలగించి దాని స్థానే అత్యాధునిక బస్ స్టేషన్ కాంప్లెక్స్ టెర్మినల్‌ను 24 ప్లాట్ ఫారాలతో పాటుగా మూడు అంతస్తులు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచి కమర్షియల్ కాంప్లెక్స్ బ్లాకులు నిర్మించనున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో అన్ని వసతులతో ఈ టెర్మినల్‌ను నిర్మించనున్నట్లు మంత్రి విశ్వరూప్ స్పష్టం చేశారు. గ్రౌండ్ ఫ్లోర్ బస్ కాంప్లెక్స్ టెర్మినల్ 9 నెలల కాలంలో పూర్తి చేసి అందుబాటులో తేవడం జరుగుతుందని, మూడు అంతస్తులను ప్రభుత్వ ప్రవేట్ భాగ స్వామ్యంతో ప్లానింగ్‌తో నిర్మించి కమర్షియల్‌గా ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఒకటి రెండు మూడు అంతస్తులను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచి కమర్షియల్ బ్లాకులను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఇళ్ళ వెంకటేశ్వరరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఆర్‌విఎస్ నాగేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ దంగేటి డోలా మణి రుద్ర, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

**విశాలాంధ్ర - కాకినాడ :** ప్రతి విద్యార్థి శాస్త్రీయ పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ సూచించారు. స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ 2022-23 కార్యక్రమం వేడుకగా సాగింది. కాకినాడ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్‌కు సుమారు 5440 నామినేషన్లు రాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 279, కాకినాడ జిల్లా నుంచి 132 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన ప్రాజెక్టులకు డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా రూ.పదివేలు చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల నుంచి సుమారు 13 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపనున్నారు. అవార్డ్స్ కార్యక్రమానికి ముఖ్య అతిధులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లోని అంతర్గతంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, ఎంఈఓ ఎల్ గణేష్ బాబు జిల్లా సైన్స్ అధికారి ఎమ్మెస్ వినీల్, వివిధ యాజమాన్యాలలోని విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## 9న జాతీయ మెగా లోక్‌అదాలత్

**విశాలాంధ్ర-కొవ్వూరు :** మార్చి 9వ తేదీన కొవ్వూరు కోర్టుల వద్ద జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక కోర్టు హాల్లో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అన్ని కేసులను పరిష్కరించుకోవచ్చు అన్నారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బులు ఆదా చేసుకోవచ్చన్నారు. కేసుల రాజీ విషయమై పోలీసులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మెజిస్ట్రేట్—ాలు జి. ఈశ్వరరావు, జి.సాయి కృష్ణపట్టణ సీఐ జగదీష్ కుమార్ ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

**విశాలాంధ్ర - ఏలేశ్వరం :** ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సాయి బాలాజీ బిఈడి కళాశాల కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన ఓటు అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. యుటిఎఫ్ సీనియర్ నేత మెతకాని రాంబాబు మాట్లాడుతూ ఓటు సామాన్యుని చేతిలో వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. తమ ఓటు దేశ దిశ నిర్దేశాలను శాసిస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని పేర్కొన్నారు. అనంతరం బాలాజీ చౌక్ సెంటర్ మీదుగా మెయిన్ రోడ్డు, పురవీధులలో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు, వివిఎస్ ఆస్మాండ్ మాస్టర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. రాజు, సుంకర హైమావతి, కే రాజమోహన్, విద్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర - ఆలమూరు :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల (మార్చి) 9న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్ వి. నాగేశ్వరరావు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ లోక్ అదాలత్ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ ప్రాంగణమునందు నిర్వహిస్తామని, రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవా లని ఆయన కోరారు. పోలీస్ సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## అమరవీరులకు ఘన నివాళులు

**విశాలాంధ్ర - పెద్దాపురం :** పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన వీర జవాన్లకు పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి జంక్షన్లో స్థానికులు, విద్యార్థులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఆజాద్ నేషనల్ ఆర్మి అధ్యక్షులు కొత్తెం కోటి ఆధ్వర్యంలో అమర వీరులకు సంస్మరణ సభ ఏర్పాటు చేసి పుల్వామ ఉగ్ర దాడిలో మృతి చెందిన జవాన్ల వీర మరణాన్ని స్మరించుకుంటూ శాంతియుత సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు మరువలేవన్నారు. పుల్వామ ఘటన సందర్భంగానే ఫిబ్రవరి 14వ తేదీన బ్లాక్ డేగా పాటించడం జరుగుతుందన్నారు. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, శీలంగి బుజ్జి, తుమ్మల బుల్లియ్య, ఎగ్గాడ శ్రీను, తుమ్మల నాని, విద్యార్థులు, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు కలెక్టర్ నివాళులు

**విశాలాంధ్ర - కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్య మంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్క రించుకుని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో

బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ.ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో డి.తిప్పేనాయక్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, డాక్టర్ ఎం. పవన్ కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి వై.వాణి, గిరిజన సంక్షేమ అధికారి ఎ. విజయ శాంతి, సాంఘిక సంక్షేమ శాఖ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు

**విశాలాంధ్ర - మామిడికుదురు :** ఇస్లాం మత వ్యవస్థాపకులు మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ జయం త్యుత్సవాన్ని పురస్కరించు కుని బుధవారం నగరం, రాజోలులో బుధవారం పలు సేవ కార్యక్రమాలు నిర్వహిం చారు. నగరం గ్రామానికి చెందిన గురుహే మొహిబ్బానే జహెరా యువజన సంఘం ఆధ్వర్యంలో రాజోలు ప్రభుత్వాసుపత్రులలోని రోగులకు పండ్లు,పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఇమామ్ హుస్సేన్ సూచించిన ఉపదేశాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఏ సూర్యనారాయణ మరియు సంఘ సభ్యులు సయ్యద్ రూహి, అబ్బాస్ హుస్సైన్, జాఫర్ అబ్బాస్, అజీబ్ హుస్సేన్, మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పుల్వామా అమరవీరులకు నివాళులు

**విశాలాంధ్ర - మామిడికుదురు :** 2019 పుల్వామాలో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన అమరవీరుల సేవలు ఎనలేనివని దీప్తి విద్యా సంస్థల కరస్పాం డెంట్ డివివి సత్యనారాయణ అన్నారు. బుధవారం మామిడికుదురులోని దీప్తి పాఠశాలలో అమరవీరులకు కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు.

## కూలీల కష్టాన్ని కాంట్రాక్టర్ బొక్కేసాడు

**విశాలాంధ్ర - అమలాపురం :** అయినవిల్లి మండలం పోతుకుర్రుకు చెందిన కూలీలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. పోతుకుర్రు జగనన్న లే అవుట్‌లో కాంట్రాక్టర్ కమిడి వెంకటేశ్వరరావు లే అవుట్ మెరక చేయించుకుని డబ్బులు ఇస్తానని నమ్మించి ఎగవేయడానికి నిరసనగా బాధితులు మంగళవారం నుండి లే ఆ వుట్ స్థలంలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఈ దీక్ష శిబిరాన్ని జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కొంకి వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులు గుత్తుల త్రిమూర్తులు, కాంట్రాక్టర్ కమిడి వెంకటేశ్వరావుని తక్షణమే అరెస్టు చేసి మా సమస్యను పరిశీలించి పరిష్కారం చెయ్యాలని మా డబ్బులు మాకు ఇప్పించండి మహాప్రభో అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు స్థానిక నాయకులు మద్దతు తెలిపారు.

## దుంప పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**విశాలాంధ్ర - పెద్దాపురం :** మెట్టలో సాగవుతున్న దుంప పంటను కేంద్రీయ దుంప పంటల పరిశోధనా కేంద్రం నుంచి తిరువనంతపురం (కేరళ) శాస్త్రవేత్తలు డాక్టర్ జి బైజు, డి జగ న్నాధన్, భువనేశ్వర్ శాస్త్రవేత్త డాక్టర్ నెడుంబిజియన్‌లు పరిశీలించారు. పెద్దాపురం దుంప పరిశోధన కేంద్రం, మండలంలోని రాయభూపాలపట్నం, కట్టమూరు గ్రామాల్లో కర్ర పెండలం దుంప సాగును బుధవారం దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎం జానకి, ఉద్యాన శాఖాధికారి ఎన్ సుజాతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు బైజు, జగన్నాధన్ మాట్లాడుతూ కేరళ నుంచి వచ్చిన శ్రీ రక్ష విత్తనం పెద్దాపురం పరిశోధనకేంద్రం నుంచి రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 8 నుంచి 9 నెలల కాల వ్యవధిలో కోతకు వచ్చే కర్రపెండలం దుంప దిగుబడిపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందని, దిగుబడి సాధారణ విత్తనం కంటే శ్రీరక్ష మరో 10 పుట్లు అధికంగా దిగుబడి రావడం అభినందనీయమన్నారు. అనంతరం రైతుల నుంచి సాగు వివరాలు, దిగుబడి వంటి అంశాలపై వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌ఎలు ఎం చిలకమ్మ, విజయదుర్గ, ఎం సత్తిబాబు, జ్యోతి, మల్లిక్, దివ్య, రైతులు పాల్గొన్నారు.

## మూడు కో ఎడ్యుకేషన్ కళాశాలల ఏర్పాటు

**విశాలాంధ్ర - అనపర్తి :** నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కో ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ అనపర్తి ఎస్ ఆర్ జడ్పీ హైస్కూల్, బిక్కవోలు జడ్పీహెచ్ఎస్, పెదపూడి మండలం గొల్లల మామిడాడ జెడ్‌పిహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్లో ప్రారంభించడం జరుగుతుందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ లేఖ ద్వారా తెలిపారని ఎమ్మెల్యే సత్తి చెప్పారు. గత విద్యా సంవత్సరంలో మహిళా జూనియర్ కళాశాలలు,ఈ ఏడాది కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చాలా సంతోషంగా ఉందని దీంతో ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి అన్నారు.

## సీఎం జగన్ లక్ష్యంగా 7 అసెంబ్లీలు గెలుస్తాం

**విశాలాంధ్ర - జగ్గంపేట :** సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యంగా కాకినాడ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజవర్గాలను గెలిచేందుకు కృషి చేస్తున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జి చలమసెట్టి సునీల్ అన్నారు. ఇన్‌చార్జిగా నియమితులైన ఆయన మధురపూడి విమానాశ్రయం నుండి 16 నెంబర్ జాతీయ రహదారి మీదుగా జగ్గంపేట నియోజకవర్గానికి చేరుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట శ్రీ చైతన్య స్కూల్ వద్ద కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్, ఉప్పలపాడు సొసైటి చైర్మన్ పాము సూరిబాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, తోట విష్ణు మూర్తి, కరుటూరి రాజు, ఎస్ఏ గఫూర్, తదితర నియోజకవర్గంలోని వైసిపి శ్రేణులు ఆయనకు పూలమాలలు, శాలువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంటుకు గతంలోతాను పోటీ చేసి ఓడి పోయినా, సీఎం జగన్ తనను పిలిచి పోటీ చేయమని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారానికి నల్లమిల్లి దంపతుల శ్రీకారం

**విశాలాంధ్ర - అనపర్తి :** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గత సాంప్రదాయాన్ని పాటిస్తూ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బుధవారం సెంటిమెంట్ పాటిస్తూ ఎప్పటిలానే అనపర్తిలో మొదటి ఓట్లు తాడి రామారెడ్డి మాస్టర్ దంపతులు, మహేంద్రవాడలో తేతలి అబ్బాస్ రెడ్డిని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు అభ్యర్థించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం

**విశాలాంధ్ర-దేవరపల్లి:** దేవరపల్లి భాష్యం స్కూల్లో బుధవారం ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు నల్లజర్ల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, దేవరపల్లి భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న షాప్ మాజీ డైరెక్టర్ రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి క్రీడల పోటీలు నిర్వహించటం ఎంతో అభినందనీయమని అన్నారు. పరుగు పందెం, లాంగ్ జంప్, 12 రకాల క్రీడలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీ.పేరయ్య నాయుడు, షేక్ షబానా శ్రీలక్ష్మి, రాధికారిణి వ్యాయామ ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్యామలాదేవికి డాక్టరేట్

**విశాలాంధ్ర-దేవరపల్లి:** దేవరపల్లి మండలం కృష్ణం పాలెంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం అధ్యక్షురాలు గుదే శ్యామలాదేవికి డాక్టరేట్ గౌరవ పురస్కారం లభించింది. ఓపు తిలాజికల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు హైదరాబాదులో ఈ నెల 9వ తేదీన గుదే శ్యామలాదేవికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. సామాజిక సేవలో భాగంగా ఆమెకు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్యామలాదేవి మాట్లాడుతూ 2015 సంవత్సరంలో తాను వృద్ధాశ్రమం ఏర్పాటు చేశానని, అప్పటినుండి తాను వృద్ధులకు, అనాధలకు వికలాంగులకు తమ ఆశ్రమంలో వసతి కల్పించి అనేక సేవా కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు.

## మత్తుకు బానిసలు కాకుండా కాపాడుదాం

**విశాలాంధ్ర - చాగల్లు :** యువత మత్తుకు బానిసలు కాకుండా కాపాడుకుందామని జమాత్ ఇస్లామీ హింద్ చాగల్లు శాఖ కన్వీనర్ తన్వీర్ అన్నారు. బుధవారం ప్రచార కార్యక్రమంలో భాగంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యపానానికి అలవాటు పడి తమ జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం మద్యపానం వల్ల అనేకమంది మృతి చెందుతున్నారని అన్నారు. మత్తు పదార్థాల దుర్వినియోగం వల్ల ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరిచేందుకు జమాత్ ఇస్లామీ హింద్ ఈనెల 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్తాఫ్ జానీ, అబ్బర్ జానీ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.


**KAKINADA MUNICIPAL CORPORATION**
**'e' Procurement Notification**

**ROC. No.32637/2023/E2.** **Dt: 14-02-2024**

Tenders invited through ap e-procurement platform for **81** works with an estimated contract value of **Rs. 6,50,46,805/-** from the eligible contractors in the following manner.

**Seventy Three Works for an amount of Rs. 4,61,94,694/-**

Last date and time for downloading bid documents : **28.02.2024 upto 02-00 PM**
Last date and time for submission of bids : **28.02.2024 upto 02-30 PM**

**Eight Work for an amount of Rs. 1,88,52,111/-**

Last date and time for downloading bid documents : **04.03.2024 upto 02-00 PM**
Last date and time for submission of bids : **04.03.2024 upto 02-30 PM**

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada.** Mail : Call Centre Phone : 0884-2357722.

**Further Details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in**

**Sd/- Jallepalli Venkata Rao,**
Commissioner
Municipal Corporation, Kakinda